

మళ్లీ ప్రాణం పోసేలా.. 8లో▸
హార్ట్ ఎటాక్ వచ్చిన వారికి వెంటనే సీపీఆర్ చేస్తే బతికే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సీపీఆర్ చేసే విధానంపై దృష్టి సారించాలని వైద్యశాఖకు ఆదేశాలు జారీ చేసింది.



మనసున్న మారాజులు
మనిషి మాయమైపోతున్నవేళ అక్కడక్కడ మనసున్న, మానవత్వమున్న వారు మెరుస్తూనే ఉన్నారు. మనీతో కాకుండా మనసుతో ఆలోచిస్తున్నాడు. 10లో▸

గరిష్ఠం/కనిష్ఠం
35.2 / 19.8

వాతావరణం
ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. ఉక్కపోత పెరుగుతుంది. చలి ప్రభావం ఉండదు.

న్యూస్‌రీల్

పాఠశాలను పరిశీలించిన రాష్ట్ర పరిశీలకుడు



విద్యార్థులకు సూచనలిస్తున్న ప్రతాప్

నిర్మల్ రూరల్: జిల్లా కేంద్రంలోని జుమ్మెరాత్‌పేట్ ప్రభుత్వ పాఠశాలను శనివారం రాష్ట్ర పరిశీలకుడు ప్రతాప్ పరిశీలించారు. విద్యార్థుల అభ్యసన తీరు, ఉపాధ్యాయుల బోధనను పరిశీలించి పలు సూచనలు చేశారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ.. ప్రతీ సబ్జెక్టు ప్రశ్నాపత్రాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేయాలన్నారు. ప్రశ్నాపత్రం బ్లూప్రింట్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పరీక్షలంటే భయపడవద్దని ఎవరిపై వారికి నమ్మకం ఉండాలన్నారు. ట్రిపుల్‌ఐటీలో సీటు సాధించడానికి కష్టపడి చదవాలని సూచించారు. ఉపాధ్యాయులు పరమేశ్వర్, రజాక్, లక్ష్మణ్, సిరాజుద్దీన్, మనోహర్, ఉజ్వల తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లో చైతన్యం తేవాలి



మాట్లాడుతున్న అరవింద్ మీనన్

నిర్మల్‌చైన్‌గేట్: సీఎం కేసీఆర్ అవినీతి పాలనను ప్రశ్నించేందుకు ప్రజల్లో చైతన్యం తేవాలని తెలంగాణ బీజేపీ సహ ఇన్‌చార్జి అరవింద్ మీనన్ పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఉమామహేశ్వర ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన జిల్లా పదాధికారుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీజేపీని జిల్లాలో బలోపేతం చేయాలని, బూత్ స్థాయి కమిటీలు పూర్తి చేసి, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షురాలు పడకంటి రమాదేవి, మాజీ ఎంపీ రమేశ్‌రాథోడ్, నిర్మల్ జిల్లా సహ ఇన్‌చార్జి మ్యాన మహేశ్, ఆదిలాబాద్ కన్వీనర్ అయ్యన్నగారి భూమన్న, ప్రధాన కార్యదర్శులు మెడిసెమ్మె రాజు, సామ రాజేశ్వర్‌రెడ్డి, పడిపెల్లి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

రెండోరోజూ కొనసాగిన ఉపాధిహామీ ప్రజావేదిక

భైంసారూరల్: మండల పరిషత్ కార్యాలయంలో చేపట్టిన 13వ విడత ఉపాధిహామీ ప్రజావేదిక శనివారం కొనసాగింది. ఎంపీపీ కల్పన అధ్యక్షతన డీఆర్డీవో విజయలక్ష్మి ఆధ్వర్యంలో పలు జీపీల్లో చేపట్టిన మొక్కల పెంపకం, డంప్‌యార్డు నిర్వహణ, పల్లె ప్రకృతి వనాల్లో ట్యాంకులు తదితర పనులపై విచారణ చేపట్టారు. నాటిన మొక్కల్లో 53 శాతం చనిపోవడం, మస్టర్లలో కూలీల సంతకాలు లేకున్నా వేతనాలు చెల్లించినట్లు ప్రజావేదికలో డీఆర్పీలు వెల్లడించారు. మండలంలోని 30 గ్రామపంచాయతీల పరిధిలో చేపట్టిన పనులు ఉపాధికూలీలతో కలిసి సామాజిక తనిఖీ సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇంటింటికి వెళ్లి కూలీలను కలిసి వివరాలు సేకరించారు. గ్రామాల వారీగా సేకరించిన వివరాలు గ్రామపంచాయతీ కార్యాలయాల్లో గ్రామసభ నిర్వహించి వెల్లడించారు. అనంతరం మండలంలో నిర్వహించిన ప్రజావేదికలో తమ దృష్టికి వచ్చిన విషయాలను వివరించారు. పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లపై డీఆర్డీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీవో గోపాలకృష్ణారెడ్డి, హెచ్‌ఆర్ సుధాకర్, ఎస్‌ఆర్‌పీ రాఘవులు తదితరులున్నారు.

‘పరీక్ష’కు వేళాయే..

- ఈ నెల 15 నుంచి ఇంటర్ పరీక్షలు
- ఏప్రిల్ 3 నుంచి పదోతరగతి ఎగ్జామ్స్
- టెలీమానస్‌తో విద్యార్థుల ఒత్తిడి దూరం
- అందుబాటులో టోల్‌ఫ్రీ నంబర్ 14416
- ఉచిత సేవలు తెచ్చిన ఇంటర్ బోర్డు
- ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలంటున్న డాక్టర్లు



నిర్మల్‌చైన్‌గేట్: ‘పరీక్షా’ సమయం దగ్గరపడుతోంది. విద్యార్థులకే కాదు.. వారికి చదువు చెప్పిన ఉపాధ్యాయులకు ఒత్తిడి ఎదురుకానుంది. ఎలాగైనా తమ విద్యార్థులు అందరికంటే మెరుగైన ఫలితాలు సాధించాలని విద్యాసంస్థల యాజమాన్యాలు, అధ్యాపకులు ఆకాంక్షిస్తుంటారు. తమ పిల్లలు మంచి మార్కులతో పాస్ కావాలని తల్లిదండ్రులూ ఆశిస్తుంటారు. తల్లిదండ్రులు, అధ్యాపకుల నుంచి విద్యార్థులపై ఒత్తిడి పెరుగుతుండగా వారు మానసికంగా, శారీరకంగా కుంగిపోతుంటారు. ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు అవసరమైన సూచనలు, సలహాలు విద్యాసంస్థల్లో వారికి అందకపోవడం శాపంగా మారింది.

ఆందోళన.. అనారోగ్యం

ప్రస్తుతం ఎండల తీవ్రత పెరుగుతోంది. స్కూళ్లు, కాలేజీలు హాస్టళ్లలో తాగునీటిని నిల్వ చేసే ట్యాంకులను రోజుల తరబడి శుభ్రం చేయడం లేదు. వీటిలో ఈకొలి, సాల్మొనెల్లా, షిజెల్లా, లెజియోనెల్లా తదితర బ్యాక్టీరియా చేరుతుంది. మెజార్టీ పాఠశాలలు, కాలేజీల్లో విద్యార్థులు ట్యాంకుల్లో నిల్వ చేసిన నీటిని తాగుతుంటారు. ఉదయం వండిన ఆహారం మధ్యాహ్నం వరకే పాడైపోతుంది. దీనిని తీసుకున్నవారు తర్వాత వాంతులు, విరోచనాలు, టైఫాయిడ్ జ్వరాల బారిన పడుతుంటారు. ఎండలో ఆడడం ద్వారా వడదెబ్బకు గురవుతుంటారు. కీలకమైన పరీక్షల సమయంలో విద్యార్థులు అస్వస్థతకు గురవుతుండడం.. అనారోగ్యం కారణంగా చదవలేకపోవడం.. చదివిన అంశాలు గుర్తుకు ఉండకపోవడం.. పరీక్షల్లో ఫెయిలైతే తల్లిదండ్రులతో పాటు బంధువులు ఇరుగుపొరుగు వారు చులకనగా చూస్తారనే భయంతో ఒత్తిడికి గురవుతుంటారు.

పరోక్షంగా తల్లిదండ్రులూ కారణమే..

రెసిడెన్షియల్ హాస్టళ్లలో ఉన్న పిల్లల పరిస్థితి ఒకలా ఉంటే.. ఇంటి నుంచి స్కూళ్లు, కాలేజీలకు వెళ్లే విద్యార్థుల పరిస్థితి మరోలా ఉంది. చాలామంది తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్యాన్ని పట్టించుకోవడం లేదు. ఉద్యోగం, వ్యాపారం తదితర పనుల్లో వారు బిజీగా ఉంటారు. కొందరైతే ఏకంగా ఇంట్లో పిల్లల సమక్షంలోనే తరచూ ఘర్షణ పడుతున్నారు. కనీసం పిల్లలు వేళకు నిద్రపోతున్నారా? లేస్తున్నారా? ఏం తింటున్నారు? ఏం చూస్తున్నారు? ఏం ఆలోచిస్తున్నారో కూడా పట్టించుకోవడం లేదు. తల్లిదండ్రుల ప్రవర్తన కూడా పరోక్షంగా విద్యార్థుల ఏకాగ్రతను దెబ్బతీస్తోంది. దీంతో మంచి మార్కులు సాధించి, ఏ ఇంజినీరో? డాక్టరో.. అవుతాడనుకున్న కొడుకు, కూతురు కళ్ల ముందే విగతజీవులుగా కనిపిస్తుండడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

ఇంటర్ విద్యార్థులకు టెలీమానస్ సేవలు

ఇంటర్ వార్షిక పరీక్షల నేపథ్యంలో ఒత్తిడి, భయం, ఆందోళన నుంచి విద్యార్థులకు ఉపశమనం కలిగించడానికి ఇంటర్ బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. వైద్యారోగ్యశాఖకు చెందిన టెలీమానస్ సేవలను ఉచితంగా వినియోగించుకునే అవకాశం ఇచ్చింది. విద్యార్థులు 14416 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించి ఒత్తిడి తగ్గించుకోవచ్చని ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్ తెలిపారు. ఈ టెలీమానస్ ద్వారా విద్యార్థులు పరీక్షలు ఎదుర్కోవడానికి కావాల్సిన విశ్వాసం, ధైర్యాన్ని ఇవ్వడమే గాకుండా మార్గదర్శనం చేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే విద్యార్థుల్లో ఆందోళన, భయం, ఒత్తిడిని దూరం చేసేందుకు ప్రయత్నిస్తారని చెప్పారు.

వార్షిక పరీక్షల షెడ్యూల్..

టెన్త్: ఏప్రిల్ 3నుంచి 13వరకు..	
సమయం: ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు..	
హాజరయ్యే విద్యార్థులు	9,075
ఎంపిక చేసిన పరీక్షా కేంద్రాలు	48
ఇంటర్ ఫస్టియర్: ఈనెల 15 నుంచి ఏప్రిల్ 3వరకు..	
సమయం: ఉదయం 9నుంచి 12గంటల వరకు..	
హాజరయ్యే జనరల్ విద్యార్థులు	6,207
ఒకేషనల్ విద్యార్థులు	1,333
ఎంపిక చేసిన పరీక్షా కేంద్రాలు	23
ఇంటర్ సెకండియర్: ఈ నెల 16నుంచి ఏప్రిల్ 4 వరకు..	
సమయం: ఉదయం 9నుంచి, 12గంటల వరకు	
హాజరయ్యే జనరల్ విద్యార్థులు	6,463
ఒకేషనల్ విద్యార్థులు	1,198
ఎంపిక చేసిన పరీక్షా కేంద్రాలు	23

ఒత్తిడికి లోనుకావద్దు



విద్యార్థులకు ఒత్తిడికి లోనుకావద్దు. పరీక్షల సమయంలో తేలిగ్గా జీర్ణమయ్యే ఆహార పదార్థాలు వండి పెట్టాలి. మసాలా వేపుళ్లు, ఆయిల్ ఫుడ్‌కు బదులు అప్పుడే వండిపెట్టిన ఆకుకూరలు, కూరగాయలు, మజ్జిగ వంటివి ఎక్కువగా అందించాలి. ఉదయం, సాయంత్రం గుడ్డుతోపాటు పండ్ల రసాలు సలాడ్స్ లాంటివి ఇవ్వాలి. వేళకు నిద్రపోయేలా చూడాలి.

– రత్నాకర్ జనరల్ ఫిజీషియన్, జిల్లా ఆస్పత్రి

వేళకు నిద్రపోవాలి



పరీక్షల సమయంలో ఎక్కువ సేపు చదవాలనే ఉద్దేశంతో చాలామంది రాత్రి పొద్దుపోయిన తర్వాత కూడా మేల్కొనే ఉంటారు. ఇలా గంటల తరబడి మేల్కొని ఉండడం ద్వారా చదివిన అంశాలు గుర్తుండవు. వేళకు నిద్రపోయి.. వేళకు మేల్కొనడంతో మానసిక ప్రశాంతత లభిస్తుంది. చదివిన అంశాలు మెదడులో నిక్షిప్తమవుతాయి. ఎంత సేపు చదివామనేది కాకుండా ఎంత ఇష్టంగా చదివామనేది కీలకం. పిల్లల మానసిక స్థితిని అంచనా వేయకుండా చదువు విషయంలో వారిపై ఒత్తిడి తేవడం సరికాదు. సాధ్యమైనంత వరకు పిల్లలను మోటివేట్ చేయాలి. సమాజంపై వారికి అవగాహన కల్పించినపుడే మంచి ఫలితాలు వస్తాయి.

– సురేశ్ అల్లాడి, మానసిక వైద్యనిపుణుడు

ఒత్తిడిని సూచించే కొన్ని సంకేతాలు

- కడుపులో తిప్పుతున్న అనుభూతి.
- వికారంగా అనిపించడం.
- అరచేతుల్లో చెమటలు పట్టడం.
- మైకం కమ్మినట్లు అనిపించడం.
- గుండె వేగంగా కొట్టుకోవడం.
- మెదడులో శూన్య భావన.
- ఏకాగ్రత లోపం.
- అయోమయం, భారంగా, నిస్పృహగా అనిపించడం.
- కుదురుగా ఉండకపోవడం, రోదించడం, పళ్ల కొరకడం, వ్యాకులత, అటూఇటూ తిరగడం, గోళ్లు కొరకడం వంటివి.
- నేనిది చేయలేను.. నేనిందుకు తగినవాడిని కాను.. లాంటి ఆలోచనలు

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



బాబాపూర్‌లో మాట్లాడుతున్న నారాయణవర్మ

లక్ష్మణచాంద: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని రాష్ట్ర స్థాయి పరిశీలకుడు నారాయణవర్మ సూచించారు. శనివారం మండలంలోని బాబాపూర్ ప్రభుత్వ ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభ్యాసన దీపికలు ప్రాక్టీస్, రాబోయే రెండో ప్రీఫైనల్ ఎగ్జామ్స్, పదో తరగతి విద్యార్థుల హాజరు 100శాతం ఉండేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. క్రమంతప్పకుండా విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించేలా చూడాలన్నారు. ప్రీఫైనల్ పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా ఏ, బీ, సీ గ్రూపులుగా విద్యార్థులను విభజించి ‘సీ’ గ్రేడ్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు శ్రద్ధ చూపేలా చూడాలన్నారు. నిత్యం ప్రత్యేక తరగతులు, అల్పాహారం అందించేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారి నర్సయ్య, ఫయీం, ప్రధానోపాధ్యాయుడు ధర్మేందర్, కిష్టయ్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కెపాసిటర్లు బిగించుకోవాలి



సబ్‌స్టేషన్ బిల్డింగ్‌ను పరిశీలిస్తున్న చౌహాన్

పెంబి: వ్యవసాయ మోటర్లకు కెపాసిటర్లు బిగించుకోవాలని ట్రాన్స్‌కో ఎస్‌ఈ చౌహాన్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ బిల్డింగ్ మరమ్మతు పనులు పరిశీలించి మాట్లాడారు. కెపాసిటర్లు బిగించగా నాణ్యమైన విద్యుత్ అందుతోందని, కరెంట్ ఎక్కువ.. తక్కువైనపుడు మోటర్లు కాలిపోకుండా ఉపయోగపడుతుందన్నారు. రైతులకు కెపాసిటర్లపై అవగాహన కల్పించాలని సిబ్బంది తెలిపారు. ఏఈ సాయికిరణ్, లైన్‌మన్ సత్యం, దివాకర్, కాంట్రాక్టర్ వివేక్, సిబ్బంది ఉన్నారు.

నత్త నడకన అనుసంధానం

- ‘ఆయుష్మాన్ భారత్’తో మేలు
- తెల్లరేషన్ కార్డుదారులు అర్హులు
- రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యం
- రేషన్‌కార్డు అనుసంధానం అంతంతే..
- జిల్లాలో 25 శాతం మాత్రమే పూర్తి
- ఈ నెల 31వరకే ఈకేవైసీకి అవకాశం



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

నిర్మల్‌చైన్‌గేట్: సామాన్య, మధ్య తరగతి ప్రజలకూ కార్పొరేట్ వైద్యం అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ రేషన్‌కార్డు అనుసంధాన ప్రక్రియ జిల్లాలో అంతంతమాత్రంగానే సాగుతోంది. తెల్లరేషన్‌కార్డు అనుసంధాన ప్రక్రియపై అధికారులు ప్రజలకు సరైన అవగాహన కల్పించకపోవడమే ఇందుకు ప్రధానకారణంగా తెలుస్తోంది. తెల్లరేషన్ కార్డుదారులు గతంలో ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.2 లక్షల వరకు ఉచితంగా వైద్యసేవలు పొందడానికి అర్హత ఉండేది. నాలుగేళ్లక్రితం ఆరోగ్యశ్రీలో ఆయుష్మాన్ భారత్‌ను విలీనం చేశారు. దీంతో అదనంగా మరో రూ.3లక్షలు కలిపి మొత్తంగా రూ.5లక్షల వరకు కార్పొరేట్ వైద్యసేవలు పొందేందుకు అవకాశం కల్పించారు. ఇందుకు తెల్లరేషన్‌కార్డున్న వారు తమ కార్డును ఆయుష్మాన్ భారత్‌కు అనుసంధానం చేసుకోవాల్సి ఉంటుంది. అయితే ఈ పథకంపై జిల్లావాసులు, ముఖ్యంగా తెల్లరేషన్ కార్డుదారుల్లో అవగాహన లేక అనుసంధాన ప్రక్రియ అంతంత మాత్రంగానే సాగుతోంది.

జిల్లాలో 2,08,684 తెల్లరేషన్ కార్డులు

జిల్లాలోని మూడు నియోజకవర్గాల పరిధిలో 2,08,684 తెల్లరేషన్ కార్డులున్నాయి. ఐదు నెలలుగా రేషన్‌కార్డు అనుసంధాన ప్రక్రియ కొనసాగుతుండగా.. ఇప్పటివరకు 59,700 కార్డుదారులు (25శాతం) మాత్రమే ఆయుష్మాన్ భారత్‌లో నమోదయ్యారు. పేదలకు ఎంతో ప్రయోజనకరంగా ఉండే ఈ పథకంపై ప్రచారం కల్పించడంలో సంబంధిత అధికారులు విఫలమయ్యారు. పట్టణ ప్రభుత్వ ఆరోగ్యకేంద్రాల్లో తెల్లరేషన్ కార్డుదారులను ఈ పథకంలో అనుసంధానం చేసేందుకు ఏఎన్‌ఎంలకు పూర్తి అధికారాలు కల్పించారు. పథకంలో చేరాలంటే లాగిన్ సౌకర్యాన్ని కూడా ఏఎన్‌ఎంలకు అందజేశారు. కార్డుదారులు నేరుగా వెళ్లి సంబంధిత సిబ్బందిని కలిస్తే వారే వీరి పేర్లను అనుసంధానిస్తారు.

2019 కంటే ముందువారే అర్హులు

మరోవైపు 2019 కంటే ముందు తెల్లరేషన్ కార్డులు కలిగిన వారికే ఈ పథకంలో చేరేందుకు ఆన్‌లైన్ అనుమతిస్తున్నదని ప్రభుత్వ వైద్యాధికారులు చెబుతున్నారు. ఆ తర్వాత తెల్లరేషన్‌కార్డులు పొందిన వారికి అవకాశం లేదని పేర్కొన్నారు. జిల్లాలో ప్రధానమంత్రి జన ఆరోగ్యయోజన యాప్‌లో ఇప్పటివరకు 25 శాతం అనుసంధాన ప్రక్రియ పూర్తయింది.

1,886 రకాల వైద్య సేవలు

ఆయుష్మాన్ భారత్ కార్డున్న వారు దేశంలో ఎక్కడైనా వైద్యసేవలు పొందే అవకాశం ఉంది. చిన్నచిన్న వ్యాధుల నుంచి గుండె, మోకాలి చిప్పల మార్పిడి వంటి 1,886 రకాల వ్యాధులకు సేవలు పొందవచ్చు. ఈ ప్రక్రియ మొత్తం ఉచితంగా స్థానికంగా ఉండే ఆరోగ్యశ్రీ, ఆరోగ్య మిత్ర సిబ్బంది, స్థానికంగా ఉండే పీహెచ్‌సీలలో అందుబాటులో ఉంటుంది. రేషన్‌కార్డుతో పాటు ఆధార్‌కార్డు, సెల్ నంబర్ చెబితే చాలు ఈ–కేవైసీ పూర్తి చేస్తున్నారు. తెల్లరేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని వినియోగించుకునేలా విస్తృత ప్రచారాన్ని నిర్వహించాల్సిన అవసరం ఉంది. రూ.5లక్షల వరకు కార్పొరేట్ వైద్య సేవలు అందించే ఈ పథకం పేదలకు ఎంతో మేలు చేస్తుంది.

అడ్డొచ్చిన కంటి వెలుగు

ఆయుష్మాన్ భారత్ పథకంలో తెల్లరేషన్ కార్డుదారులను ఆరోగ్య కేంద్రాల ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు అనుసంధానిస్తున్న క్రమంలోనే కంటివెలుగు శిబిరాలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో యూపీహెచ్‌సీల సిబ్బంది అంతా కంటివెలుగు శిబిరాలకు పరిమితమయ్యారు. అయినప్పటికీ ఆరోగ్య కేంద్రాలకు నేరుగా వచ్చేవారిని ఈ పథకంలో నమోదు చేస్తున్నామని వైద్యాధికారులు చెబుతున్నారు.

సేవలు సద్వినియోగం చేసుకోవాలి



తెల్లరేషన్ కార్డు కలిగిన వారంతా ఆరోగ్యమిత్రలు, సీఎస్‌సీ సెంటర్ల ద్వారా ఉచితంగా ఆయుష్మాన్ భారత్‌కు ఈకేవైసీ నమోదు చేసుకోవాలి. లబ్ధిదారులు ఈ కేవైసీ నమోదుకు ఎవరికి డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదు. రేషన్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఆయుష్మాన్ భారత్‌తో అనుసంధానం చేయించుకుంటే రూ.5 లక్షల వరకు కార్పొరేట్‌స్థాయి వైద్యం దేశంలో ఎక్కడైనా ఉచితంగా పొందవచ్చు.

– భూమారెడ్డి, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్

నిరుపేదల సంక్షేమానికి పెద్దపీట



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

- రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి
- సారంగపూర్‌లో చెక్కుల పంపిణీ

సారంగపూర్: నిరుపేదల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో శనివారం 36మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబాలకు చెందిన ఆడపిల్లల వివాహానికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ కింద ప్రభుత్వం ఆర్థికసాయం అందిస్తూ అండగా నిలుస్తోందని చెప్పారు. మహిళా సాధికారతకు ఎనలేని కృషి చేస్తోందని తెలిపారు. మహిళలకు స్వయం ఉపాధికోసం రుణాలు ఇస్తోందని చెప్పారు. కుటీర పరిశ్రమల ఏర్పాటుకు సహకారం అందిస్తోందని తెలిపారు. దేశంలో ఏరాష్ట్రంలోనూ లేని పథకాలు తెలంగాణలో అమలు కావడం, అభివృద్ధి జరగడం చూసి ఓర్వలేని బీజేపీ ఎమ్మెల్సీ కవితను లిక్కర్ స్కాంతో ముడిపెట్టిందని ఆరోపించారు. భవిష్యత్‌లో బీజేపీకి ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమని ధీమా వ్యక్తంజేశారు. ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, ఆర్డీవో స్రవంతి, ప్రముఖ పారిశ్రామికవేత్త అల్లోల మురళీధర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ఇస్మాయిల్, రాజ్‌మహ్మద్, మల్లయ్య, తహసీల్దార్ సంతోష్‌రెడ్డి, ఎంపీడీవో సరోజ తదితరులున్నారు.

వందరోజుల్లో వర్గీకరణేది?

- ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు నరేశ్‌మాదిగ
- జిల్లా కేంద్రానికి చేరిన మాదిగల సంగ్రామయాత్ర



నినాదాలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: ఎస్సీ వర్గీకరణకు 28 ఏండ్లుగా మద్దతు తెలిపి, తొమ్మిదేండ్లలో దేశంలో అధికారంలో ఉండి ఇచ్చిన హామీని నెరవేర్చకుండా మాదిగలు, ఉప కులాలను బీజేపీ దారుణంగా మోసం చేసిందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేశ్‌మాదిగ ఆరోపించారు. మాదిగల సంగ్రామయాత్రలో భాగంగా శనివారం జిల్లా కేంద్రానికి చేరుకున్న సందర్భంగా ఎమ్మార్పీఎస్, నిర్మల్ టౌన్, కన్వీనర్, కత్తి నవీన్‌మాదిగ, కో కన్వీనర్ కళ్యాణ్ మాదిగ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలను నమ్మించడంలో, నమ్మిన ప్రజలను దారుణంగా మోసం చేయడంలో బీజేపీకి నోబెల్ బహుమతి ఇవ్వొచ్చని ఎద్దేవా చేశారు. ఎస్సీ వర్గీకరణ అమలులో లేకపోవడంతో విద్యారంగం, ప్రభుత్వ ఉద్యోగాల్లో మాదిగలు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఈ నష్టానికి పూర్తి బాధ్యత బీజేపీదేనని, మాదిగలను మోసం చేసిన పార్టీలు కాలగర్భంలో కలిసిపోయాయని, బీజేపీకి అదే గతి పడుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన మాదిగలు తిరగబడితే బీజేపీ భూస్థాపితం అవుతుందన్నారు. బీజేపీ మీద జరగబోయే యుద్ధానికి మాదిగలంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఏప్రిల్ 4న జరిగే ‘చలో హైదరాబాద్’కు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి మునుగూరి ప్రణీత్, జిల్లా కన్వీనర్ శనిగారపు కమలాకర్ మాదిగ, కన్వీనర్ బర్ల రాజ్‌కుమార్, నందకుమార్, రవి, అరెల్లి మల్లేశ్, కుడాల స్వామి, సాయిచంద్, పాదయాత్ర బృందం బాలు, అభిలాష్, మహిపాల్, చిట్టి రవి పాల్గొన్నారు.

‘చేయి’ జారుతున్నారు

- గెలిచిన వాళ్లూ దూరమవుతున్నారు
- ఒక్కొక్కరుగా పార్టీ వీడుతున్న కౌన్సిలర్లు
- కనిపించని పోరుయాత్ర ప్రభావం
- మున్సిపల్‌పై దృష్టిపెట్టని హస్తం

నిర్మల్: కాంగ్రెస్.. స్వాతంత్ర్యానికి ముందునుంచీ ఉన్న ఈ పార్టీకి జిల్లాలోనూ ఘనమైన చరిత్ర ఉంది. పీసీసీ, ఏఐసీసీ స్థాయిలో ఎంతోమంది నేతలనూ అందించింది. అలాంటి పార్టీ జిల్లాలో రోజురోజుకూ దిగజారుతోంది. నాయకత్వ లోపమా.. క్యాడర్‌లో నమ్మకం తగ్గడమా.. కారణమేదైనా ప్రస్తుత పరిస్థితిపై కార్యకర్తల్లోనూ అంతర్మథనం కొనసాగుతోంది. ‘హాథ్‌సే హాథ్ జోడో’ కొనసాగింపు అంటూ.. ఇటీవల జోరుగా ప్రారంభించిన తెలంగాణ పోరుయాత్ర ఓ రకంగా విఫలమైందన్న భావన కనిపిస్తోంది. నాలుగుచోట్ల కార్నర్ మీటింగ్‌లు పెట్టి, బడా లీడర్లను రప్పించినా పెద్దగా లాభం కనిపించడం లేదు. సరికదా.. ఉన్న ప్రజాప్రతినిధులూ దూరమవుతున్నారు. జిల్లాకేంద్రంలో హస్తం గుర్తుపై గెలిచిన నలుగురు కౌన్సిలర్లు, ఒక మాజీ కౌన్సిలర్ పార్టీని వీడారు. గెలిచిన కౌన్సిలర్లనూ కాపాడుకోలేకపోతున్నామన్న ఆవేదన కార్యకర్తల్లో ఉంది. ఇందుకు నాయకత్వం తీరే కారణమన్న ఆరోపణలున్నాయి.

ఒక్కొక్కరుగా వీడుతున్నారు..

గులాబీగాలి బలంగా ఉన్నప్పటికీ నిర్మల్ మున్సిపాలిటీలో ఏడుగురు కౌన్సిలర్లు కాంగ్రెస్ నుంచి గెలుపొందారు. మొదట్లో అధికారపార్టీని ఇరుకున పెట్టేలా సమావేశాల్లో దీటుగా నిలిచారు. పలు ప్రజాసమస్యలూ లేవనెత్తారు. క్రమంగా కాంగ్రెస్ నాయకత్వం నుంచి సరైన గైడెన్స్ లేకపోవడం, అధికారపార్టీ అన్నిరకాలుగా చూసుకుంటామని హామీలివ్వడంతో ఒక్కొక్కరుగా పార్టీకి దూరమవుతున్నారు. ఏడుగురిలో కత్తి నరేందర్ మాజీ మున్సిపల్ చైర్మన్ గణేశ్‌చక్రవర్తి వెంట బీజేపీలో చేరారు. ఒకేసారి చేయిగుర్తుపై కౌన్సిలర్‌గా గెలుపొందిన తౌహీదుద్దీన్ (రవ్ఫు) దంపతులు మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. తాజాగా, మరో కాంగ్రెస్ కౌన్సిలర్ తారక వాణి, ఆమె భర్త మాజీ కౌన్సిలర్ తారక రఘువీర్ పార్టీకి రాజీనామా చేశారు. త్వరలోనే బీఆర్‌ఎస్‌లోనే చేరనున్నట్లు ప్రకటించారు. మిగతా ముగ్గురిలోనూ ఒకరిద్దరు పార్టీ మారే అవకాశాలున్నట్లు సమాచారం.

బల్దియాపై దృష్టి పెట్టలె

బీఆర్‌ఎస్‌కు బలమైన ప్రత్యర్థిగా ఉన్న కాంగ్రెస్ మున్సిపల్‌లోనూ హోరాహోరీగా తలపడింది. ఏడు స్థానాలను దక్కించుకుంది. అనుకున్న స్థానాలు రాకపోవడంతో పార్టీ నాయకత్వం బల్దియాపై అసలే దృష్టిపెట్టలేదన్న విమర్శలు వచ్చాయి. గెలిచిన కౌన్సిలర్లే అధికార పార్టీని అంతోఇంతో ఇరుకున పెట్టే ప్రయత్నం చేశారు. స్వప్రయోజనాలతో పాటు పార్టీపరంగా బలమైన మద్దతు లేకపోవడం కూడా పార్టీ మారడానికి కారణంగా చెబుతున్నారు.

పోరుయాత్ర ప్రభావమేది?

జిల్లాలో రోజురోజుకూ పడిపోతున్న హస్తం గ్రాఫ్‌ను పెంచుకునే బూస్టలాగా తెలంగాణ పోరుయాత్ర ఉపయోగపడుతుందని అంతా భావించారు. ఏఐసీసీ నేత మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో భైంసాతో మొదలుపెట్టి నిర్మల్, లక్ష్మణచాంద, మామడ మండలాల్లో యాత్ర కొనసాగించారు. పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే సహా ఉత్తమ్, వీహెచ్, భట్టి, దామోదర రాజనర్సింహ లాంటి బడాలీడర్లు వచ్చారు. కానీ.. నిర్మల్ మినహా మిగతా మూడుచోట్ల అనుకున్న స్థాయిలో జనం నుంచి స్పందన కనిపించలేదు. భైంసా సభకు నిర్మల్ నుంచే అంతోఇంతో కార్యకర్తలను తరలించారు. నిర్మల్‌లో జరిగిన కార్నర్ మీటింగ్ మాత్రం కొంత ఫర్వాలేదనిపించింది. అసలు.. హడావుడిగా చేపట్టిన పోరుయాత్రకూ నాయకులు సరైన జనసమీకరణ చేయలేదన్న విషయం స్పష్టమైంది.

ఎందుకిలా..

రెండుపర్యాయాలు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్‌పై సహజంగా వ్యతిరేకత ఉన్నా దాన్ని తమకు అనుకూలంగా మలుచుకోవడంలో ప్రతిపక్షాలు విఫలమవుతున్నాయన్న వాదన ఉంది. జిల్లాలోనూ ఇదే పరిస్థితి. ఇక్కడి అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నేతలపై అవినీతి, ఆక్రమణలు, కేసులు తదితర ఆరోపణలున్నాయి. కానీ.. ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీలు పెద్దగా స్పందిస్తున్న దాఖలాలు లేవు. ప్రధానంగా కాంగ్రెస్ నుంచి స్పందన అంతంత మాత్రంగానే వస్తోంది. ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్‌గా ఉన్న మహేశ్వర్‌రెడ్డి స్థానికంగా ఎక్కువ సమయం ఇవ్వకపోవడం, ఆయన లేనప్పుడు పార్టీని నడిపించే నాయకులు లేకపోవడం పెద్ద మైనస్‌గా మారిందన్న వాదన కాంగ్రెస్ నుంచే వినిపిస్తోంది. రెండు పర్యాయాలు ఓడినా కాంగ్రెస్‌కు తమకంటూ క్యాడర్ ఉండడం గొప్పవిషయం. కానీ.. కార్యక్రమాల నిర్వహణ, నాయకత్వ తీరులో లోపాలే చాలామందిని దూరం చేస్తున్నాయన్న ఆవేదన వారి నుంచే వస్తోంది. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఇప్పుడైనా పార్టీని గాడిన పెట్టాలని క్యాడర్ ఆకాంక్షిస్తోంది.



మహేశ్వర్‌రెడ్డితో పోరుయాత్రలో అగ్రనేతలు (ఫైల్)

మళ్లీ ప్రాణం పోసేలా..

- సీపీఆర్‌తో ఆగిన గుండెకు ఊపిరి
- ఇటీవల పెరిగిన గుండెపోటు మరణాలు
- అప్రమత్తమై డాక్టర్లకు శిక్షణ ఇస్తున్న వైద్యశాఖ
- ఈ నెలలో సిబ్బందికి, ఆ తర్వాత ఇతర శాఖల్లోనూ తర్ఫీదు

నిర్మల్‌చైన్‌గేట్: దేశవ్యాప్తంగా సడెన్ కార్డియాక్ అరెస్ట్ కేసులు పెరుగుతున్నాయి. నిత్యం పలువురు గుండెపోటుతో చనిపోతున్నారు. యుక్త వయస్సులో ఉన్నవారు, చిన్నారులు కూడా మృత్యువాత పడుతున్నారు. హార్ట్ ఎటాక్ వచ్చిన వారికి వెంటనే సీపీఆర్ చేస్తే బతికే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమై గుండెపోటు సంఘటనలపై జాగ్రత్తగా ఉండాలని, సీపీఆర్ చేసే విధానంపై దృష్టి సారించాలని వైద్యశాఖకు ఆదేశాలు జారీ చేసింది. గుండెపోటు వచ్చిన వ్యక్తులకు వైద్యం అందేలోపు సీపీఆర్ ప్రక్రియ నిర్వహిస్తే ప్రాణాలు కాపాడే అవకాశం ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు.


సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, ఎస్పీ (ఫైల్)

- గత నెల 26న నిర్మల్ జిల్లా కుభీర్ మండలంలోని పార్డి(కె)లో పెళ్లి బరాత్‌లో పెళ్లి కుమారుని బంధువైన మహారాష్ట్రలోని శివుని గ్రామానికి చెందిన ముత్యం(18) అనే యువకుడు డ్యాన్స్ చేస్తూ ఒక్కసారిగా కుప్ప కూలాడు. గమనించిన స్థానికులు యువకుడిని లేపి పరిశీలించగా అపస్మారక స్థితికి చేరుకున్నాడు. హుటాహుటిన భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.
- గత నెల 27న నిర్మల్ జిల్లా ముధోల్ మండలంలోని చించాలలో ఒకేరోజు ఇద్దరు వ్యవసాయ కూలీలు గుండెపోటుతో మృతి చెందారు. వరగంటి లక్ష్మణ్ (33) ఆదివారం రాత్రి 11 గంటలకు గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలిసిన గ్రామస్తులతో పాటు కండెల రాఘవులు (42) మృతున్ని చూసేందుకు వెళ్లారు. ఇంటికి తిరిగివచ్చిన రాఘవులు 12 గంటల ప్రాంతంలో గుండెపోటుకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు వెంటనే భైంసాలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.
- ఈ నెల 9న నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం మస్కాపూర్ గ్రామానికి చెందిన ప్రధానోపాధ్యాయుడు చిలుకూరి విజయేందర్ (51) గుండెపోటుతో మృతి చెందాడు. పెంబి మండలం మందపల్లి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న విజయేందర్ విధులకు వెళ్లేందుకు ఉదయం ఇంట్లో సిద్ధమవుతుండగా ఒక్కసారిగా కుప్పకూలాడు. కుటుంబీకులు స్థానిక ప్రైవేటు ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం నిర్మల్లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.
- ఈ నెల 11న మంచిర్యాల జిల్లా జన్నారం మండలం రూప్‌నాయక్‌తండాకు చెందిన బూక్యా దశరథ్‌నాయక్ (51) గుండెపోటుతో మృతి చెందాడు. కవ్వాల్ బాలికల ఆశ్రమ పాఠశాల వార్డెన్‌గా పనిచేస్తున్న దశరథ్ నాయక్ జన్నారం పాఠశాల ఇన్‌చార్జి వార్డెన్‌గా కూడా విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం రాత్రి విపరీతమైన దగ్గుతో పాటు చాతిలో నొప్పిరావడంతో కుటుంబ సభ్యులు జన్నారం ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు అందుబాటులో లేకపోవడంతో లక్సెట్టిపేటకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

మాస్టర్ ట్రైనింగ్ పూర్తి

ఈ నెల 1న మంచిర్యాల జిల్లాలోని ఐదుగురు ప్రభుత్వ వైద్యులకు ఇటీవల హైదరాబాద్‌లో మాస్టర్ ట్రైనింగ్ అందించారు. పాతమంచిర్యాల యూపీహెచ్‌సీ డాక్టర్ రమేశ్, షంశేర్‌నగర్ యూపీహెచ్‌సీ డాక్టర్ సృజన్, దండేపల్లి పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ సతీశ్, జైపూర్ పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ అనిల్, వేమనపల్లి పీహెచ్‌సీ డాక్టర్ రాజేశ్ శిక్షణ పొందారు. నిర్మల్ జిల్లాలో వెల్మల్, పెంబి, కుంటాల, బాసర పీహెచ్‌సీలకు చెందిన వైద్యులకు మాస్టర్ ట్రైనర్లుగా శిక్షణ ఇచ్చారు. మున్సిపల్, పోలీస్, రెవెన్యూతో పాటు ఇతర శాఖల సిబ్బందికి పలు దఫాలుగా శిక్షణ అందించనున్నారు.

అకస్మాత్తుగా ఎందుకు ఆగిపోతుంది..

ఊపిరితిత్తుల్లో రక్తం గడ్డ కట్టడం, గుండె కొట్టుకోవడంలో సమస్యలు ఏర్పడటం, గుండె కండరం దళసరిగా ఉండడం, ఒత్తిడి వంటి ఏదో కారణంతో సడన్ కార్డియాక్ అరెస్ట్ ఏర్పడుతుందని వైద్యులు పేర్కొంటున్నారు. సడన్ కార్డియాక్ అరెస్ట్‌కు గురైతే గుండె మొత్తం ఒకేసారి పనిచేయడం ఆగిపోయి నిమిషాల వ్యవధిలోనే ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. జంక్‌ఫుడ్, స్థూలకాయం, ధూమపానం, అధికంగా మద్యం సేవించడం, మానసిక ఒత్తిడి, రక్తపోటు, మధుమేహం కారణంగా గుండె వ్యాధి లేని వారు కూడా సడన్ కార్డియాక్ అరెస్ట్ బారిన పడుతున్నారు. రోజూ వ్యాయామం చేస్తే కార్డియాక్ అరెస్ట్ బారిన పడకుండా కొంతవరకు కాపాడుకునే అవకాశం ఉంటుందని వైద్యులు సూచిస్తున్నారు.

సీపీఆర్ ఎలా చేయాలంటే?

సీపీఆర్.. (కార్డియో పల్మనరీ రీససిటేషన్) గుండె పనితీరు అకస్మాత్తుగా ఆగిపోయేటప్పుడు, ఆగిపోయిన వారికి వెంటనే పంప్ చేసేందుకు ఈ ప్రక్రియ చేపడతారు. సీపీఆర్ చేసేటప్పుడు బాధితుడిని బల్లపరుపుగా ఉన్న స్థలంలో పడుకోబెట్టాలి. ఎడమచేతి వేళ్ల మధ్య కుడిచేతి వేళ్లు లేదా కుడిచేతి వేళ్ల మధ్య ఎడమచేతి వేళ్లు జొప్పించి బాధితుడి ఛాతి (గుండెపై కాదు)మధ్య భాగంలో నొక్కాలి. క్రమంగా ప్రెస్ చేస్తూ ఉండాలి. నొక్కేటప్పుడు మన చేతులు, మోచేతులు అసలు బెండు కాకూడదు. చేతులు స్టిఫ్‌గా ఉంచి నొక్కాలి. బాధితుడి ఛాతి కనీసం ఐదు సెంటీమీటర్లు లోపలికి వెళ్లేలా నొక్కాలి. ఎముకలు విరిగిపోతాయని భయపడకూడదు. నిమిషానికి వందసార్లు ప్రెస్ చేశాక పల్స్ చెక్ చేయాలి. పల్స్ దొరకకపోతే మళ్లీ ఆ ప్రక్రియ కొనసాగించాలి. ఇలా ఒక్కోసారి 20 నుంచి 30 నిమిషాల వరకు చేస్తూనే ఉండాలి. కంటిన్యూస్‌గా చేస్తున్నప్పుడు గుండె మళ్లీ కొట్టుకునే అవకాశం ఉంటుంది. హార్ట్ ఎటాక్ వచ్చిన వెంటనే సీపీఆర్ చేస్తే ప్రయోజనం ఉంటుంది. ఆలస్యం చేస్తే లాభం ఉండదు. ఇవి చేస్తూనే అంబులెన్స్‌లకు సమాచారం ఇవ్వాలి.

త్వరలో శిక్షణ తరగతులు



జిల్లాలోని 18 పీహెచ్‌సీలు, 3 అర్బన్ పీహెచ్‌సీలు, నిర్మల్, ఖానాపూర్, భైంసా ప్రభుత్వ దవాఖానాల్లోని సిబ్బందికి సీపీఆర్‌పై త్వరలో శిక్షణ ఇస్తాం. పోలీసులు, మున్సిపల్ కార్మికులు, 108 సిబ్బంది, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలకు శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇప్పటికే జిల్లాలోని నలుగురు వైద్యులు ఈ నెల 1న మాస్టర్ ట్రైనర్లుగా శిక్షణ పూర్తి చేసుకుని వచ్చారు.

– ధన్‌రాజ్, డీఎంహెచ్‌వో, నిర్మల్

అవగాహన పెంచుకోవాలి



గుండెపోటు వచ్చిన సమయంలో సీపీఆర్ ప్రక్రియ చాలా ప్రధానమైనది. ఆలస్యం చేయకుండా వెంటనే చేతులతో కొన్ని నిమిషాల పాటు ప్రెస్సింగ్ చేస్తే తిరిగి గుండె పనిచేస్తుంది. ఈ ప్రక్రియ ద్వారా మనిషి ప్రాణాలను తిరిగి నిలబెట్టవచ్చు. సీపీఆర్‌పై అందరూ అవగాహన పెంచుకోవాలి.

– డాక్టర్ రత్నాకర్, ఎండీ జనరల్ ఫిజీషియన్, సర్వజన ఆస్పత్రి, నిర్మల్

బతికే అవకాశం ఉంది



ఎవరైనా గుండెపోటుకు గురై హఠాత్తుగా పడిపోతే సీపీఆర్ చేయడంతో బతికే అవకాశాలు ఉన్నాయి. రెండు చేతులతో రోగి చాతిపై బలంగా నొక్కాలి. ఇలా 20 నుంచి 30 సార్లు చేయడం వల్ల రక్త ప్రసరణ జరిగి గుండె మళ్లీ కొట్టుకునే అవకాశం ఉంటుంది. వెంటనే రోగిని దవాఖానాకు తీసుకెళ్లాలి.

– డాక్టర్ అరుణ్ మోరే, గుండె వైద్యనిపుణుడు, డీవీఆర్ హాస్పిటల్, నిర్మల్

క్లుప్తంగా

కల్చరల్ ఫెస్ట్ నిర్వహణ అభినందనీయం

ఉట్నూర్(ఖానాపూర్): విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను ప్రోత్సహించేందుకు కల్చరల్ ఫెస్ట్ నిర్వహించడం అభినందనీయమని జెడ్పీచైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. శనివారం ఐటీడీఏ ఆధ్వర్యంలో కుమురం భీం ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో వరుణ్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు వారి భవిష్యత్‌ను తీర్చిదిద్దడం కోసం గిరిజన సంక్షేమ శాఖ చేస్తున్న కృషి మరువలేనిదన్నారు. వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని రంగాల్లో విద్యార్థులకు అవగాహన కలిగించేలా కార్యక్రమం రూపొందించామన్నారు. గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు గిరిజన క్రీడోత్సవాలు, సైన్స్‌ఫెర్ ప్రదర్శనలు, మార్చిలో కల్చరల్ ఫెస్ట్ లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వివిధ పోటీల్లో ప్రతిభ కనబర్చిన 51 మంది విద్యార్థులకు ప్రశంస పత్రాలతో పాటు జ్ఞాపికలు అందించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు దిలీప్‌కుమార్, ఉట్నూర్, భీంపూర్ జెడ్పీటీసీలు చారులత, సుధాకర్, డీటీడీవోలు మణెమ్మ, నీలిమ, ఏసీఎంవో జగన్, ఏటీడీవోలు సౌజన్య, నిహారిక, క్రాంతికుమార్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక


రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని దీక్ష జూనియర్ కళాశాలలో శనివారం హైదరాబాద్ విశ్వం స్కూల్ ల్యాబ్స్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అబాకస్, వేదిక్ మ్యాథ్స్ పోటీలు నిర్వహించారు. జిల్లాలోని 11 పాఠశాలల నుండి 180 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు 25 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో విశ్వం స్కూల్ జోనల్ మేనేజర్ మారుతి, వినాయక్, లక్ష్మీనారాయణ, శివ, రాజ్‌కుమార్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య


గంగాజల(ఫైల్)

దస్తురాబాద్(ఖానాపూర్): పురుగుల మందుతాగి డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని మున్యాల గ్రామ పంచాయతీ పరిధిలోని పెద్దూర్‌కు చెందిన జాడి గంగాజల(19) కడెం మండల కేంద్రంలోని ఎల్ఎంఆర్ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. సెల్‌ఫోన్‌లో తరచూ ఎందుకు మాట్లాడుతున్నావని తండ్రి జాడి శంకరయ్య మందలించాడు. మనస్తాపం చెందిన విద్యార్థిని పురుగుల మందు తాగి ఇంట్లో పడిపోయింది. గమనించిన కుటుంబ సభ్యులు ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

పాఠశాలలు సందర్శించిన రాష్ట్ర పరిశీలకులు


మాట్లాడుతున్న నారాయణవర్మ

ఖానాపూర్: మండలంలోని పాత ఎల్లాపూర్ జెడ్పీఎస్ఎస్‌తో పాటు ప్రాథమిక పాఠశాలలను శనివారం విద్యాశాఖ రాష్ట్ర పరిశీలకులు నారాయణ వర్మ సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థుల ఎఫ్ఏ మార్కులు, ఎస్ఏ-1, ప్రత్యేక తరగతులు, తదితర బోధన విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఏఎంవో నర్సయ్య పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యంతో పరీక్షలకు సిద్ధంకావాలి

ముధోల్: పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలకు ఆత్మస్థైర్యంతో సిద్ధం కావాలని డీఈవో రవీందర్‌రెడ్డి అన్నారు. శనివారం ముధోల్, బాసర ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాలలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వార్షిక పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. విద్యార్థులను పలుప్రశ్నలు అడిగి సమాధానం రాబట్టారు. ఉపాధ్యాయులను అడిగి సందేహాలు నివృత్తి చేసుకోవాలన్నారు. విద్యార్థులు ఆందోళనకు గురికావద్దన్నారు. వార్షిక పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. అనంతరం మన ఊరు–మన బడి పనులను పరిశీలించి సలహాలు, సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి మైసాజీ, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

వాటర్‌ట్యాంకులో పడి యువకుడు మృతి


సాహెబ్‌రావు(ఫైల్)

కుభీర్(ముధోల్): వాటర్‌ట్యాంకులో పడి యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని కిషన్‌నాయక్‌తండాలో చోటు చేసుకుంది. ఏఎస్సై యశ్వంత్ తెలిపిన వివరాల ప్రకారం తండాకు చెందిన జాదవ్ సాహెబ్‌రావు (28) ఈ నెల 5న ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగిరాలేదు. అతని మానసిక పరిస్థితి కోల్పోయిన సదరు యువకుడు నాలుగైదు రోజులపాటు బయట తిరిగి ఇంటికి వచ్చేవాడు. ఈసారి కూడా అలాగే వస్తాడని కుటుంబ సభ్యులు అనుకున్నారు. తండాకు చెందిన అజయ్ ఈ నెల 10న రాత్రి రోడ్డు వెంట నడిచి వెళ్తుండగా వాటర్ ట్యాంకు సమీపంలో సెల్‌ఫోన్ రింగ్ అవుతున్న శబ్దం వినిపించింది. ట్యాంకు ఎక్కిచూడగా మృతుని బట్టలు, చెప్పులు కనిపించాయి. ట్యాంకులోకి తొంగిచూడగా మృతదేహం కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. శనివారం ఉదయం పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించి అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. మృతునికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. భార్య జాదవ్ సత్తుబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

‘గిరి’ మహిళలకు ‘స్టార్ లెజెండ్’

- అవార్డుకు ఎంపికైన కన్నిబాయి, సోంబాయి
- ఆదివాసీ బిడ్డలకు దక్కిన గౌరవం


అవార్డు ప్రదానం చేస్తున్న సువర్ణకుమారి

కెరమెరి(ఆసిఫాబాద్): కుమురం భీం జిల్లా కెరమెరి మండలంలోని భీమన్‌గొంది గ్రామానికి చెందిన మడావి కన్నిబాయి సేవా కార్యక్రమాలతో పాటు, కొలాం ఆదివాసీల జీవిత చరిత్ర, వారు పడుతున్న కష్టాలను అధికారులు దృష్టికి తీసుకువెళ్లి చూపారు. సాహస కృత్యాల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిల్లో పలు పతకాలు సాధించారు. అడ్వెంచర్ క్లబ్‌కే బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచారు. విశ్వంబరి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తాళ్లూరి సువర్ణకుమారి శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో మడావి కన్నిబాయి, కుమురం భీం మనవరాలు కుమురం సోంబాయికి ×జాతీయ మహిళా స్టార్ లెజెండ్‌* అవార్డును అందజేశారు. ఇరువురిని శాలువాలతో సత్కరించి ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంతోష్ కుమార్, పల్లం నవీన్‌కుమార్, స్వరూపరాణి, మాధవి, నీరజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విచారణ కేసుల శాతాన్ని తగ్గించాలి


అవార్డులు పొందిన సిబ్బందితో ఎస్పీ, డీఎస్పీ

- ఎస్పీ ప్రవీణ్‌కుమార్

నిర్మల్‌టౌన్: విచారణలో ఉన్న కేసుల శాతాన్ని తగ్గించేందుకు పోలీస్ అధికారులంతా బాధ్యతగా వ్యవహరించాలని ఎస్పీ సీహెచ్ ప్రవీణ్‌కుమార్ సూచించారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలోని పోలీస్ అధికారులతో శనివారం నెలవారీ సమీక్ష నిర్వహించారు. ముందుగా ఎస్పీ పోలీస్‌స్టేషన్ల వారీగా గతంలో నమోదైన కేసుల వివరాలు పోలీస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొన్ని నెలలుగా ఆయా పోలీస్‌స్టేషన్లలో నమోదైన కేసులను సమీక్షించి డిస్పోసలైన కేసుల వివరాలు తెలుసుకున్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా గత నెలలో ఆయా పోలీస్‌స్టేషన్లలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల గురించి ఆరా తీశారు. ఆయా సర్కిళ్లవారీగా నమోదైన గ్రేవ్ కేసులను సమీక్షించారు. ఎస్పీ మాట్లాడుతూ నూతన టెక్నాలజీపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కోర్టు విధులు నిర్వహించే పోలీస్ అధికారులు సమర్థవంతంగా పనిచేసి కన్విక్షన్ రేటు పెంచాలని కోరారు. ఇందుకు సాక్షులను సరైన విధంగా ప్రవేశపెట్టాలని, అవసరమైతే మెజిస్ట్రేట్, పీపీల సూచనలు తీసుకోవాలని సూచించారు. హెచ్ఆర్ఎంఎస్ అప్లికేషన్ ద్వారా పోలీస్‌శాఖలో కాగిత రహిత సేవలు అందించడం సాధ్యమవుతుందన్నారు. స్టేషన్‌లో సిబ్బందికి ఎప్పటికప్పుడు ఎస్‌హెచ్‌వోలు సరైన సూచనలు ఇస్తూ వారికి విధులపై అవగాహన కల్పించాలన్నారు. ఫిర్యాదుదారులపై మర్యాదగా వ్యవహరించాలన్నారు. ఆస్తి సంబంధిత నేరాలు జరగకుండా ముందస్తు సమాచార సేకరణ చేస్తూ, రాత్రి గస్తీ, పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. టీఎస్ సీవోపీ, డయల్ 100కు కాల్స్ వచ్చినప్పుడు హాజరయ్యే విధానం, క్లోసింగ్ విధానం గురించి పోలీస్ అధికారులకు వివరించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన నిర్మల్ డీఎస్పీ జీవన్‌రెడ్డికి ప్రశంసాపత్రం అందజేశారు. సమీక్షా సమావేశంలో భైంసా ఏఎస్పీ కాంతిలాల్, నిర్మల్ డీఎస్పీ జీవన్‌రెడ్డి, ఎస్బీ ఇన్‌స్పెక్టర్, డీసీఆర్బీ, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు, జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల ఎస్సైలు, ఐటీ సెల్ పాల్గొన్నారు.

మరాఠ్వాడలో గులాబీజెండా ఎగరాలి

- స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి
- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి
- మహారాష్ట్రలో పలు కార్యక్రమాల్లో ‘అల్లోల’


మాట్లాడుతున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్:మరాఠ్వాడలో గులాబీ జెండా రెపరెపలాడాలని, మహారాష్ట్రలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అన్ని స్థానాల్లో పోటీ చేస్తుందని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. మహారాష్ట్రలోని కిన్వట్ తాలూకా దయాళ్ ధనోరా గ్రామంలో శనివారం నిర్వహించిన ప్రముఖ ఆధ్యాత్మిక గురువు రామారావు మహారాజ్ విగ్రహ ప్రతిష్టాపనోత్సవంలో పాల్గొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారని, ఇందుకు బీఆర్ఎస్ శ్రేణులు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగానే మహారాష్ట్రలో కో–ఆర్డినేటర్లను నియమించి, పార్టీ విస్తరణకు పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నామన్నారు. తెలంగాణలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు మహారాష్ట్రలో కూడా అమలు చేయాలని ప్రజలు బలంగా కోరుకుంటున్నారన్నారు. సీఎం కేసీఆర్ నాందేడ్ సభ తర్వాత మహారాష్ట్రలో బీఆర్ఎస్ పార్టీకి అనూహ్య మద్దతు లభిస్తోందన్నారు. మహారాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా రెపరెపలాడటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

రామారావు మహారాజ్ సేవలు చిరస్మరణీయం..

గిరిజనుల ఐక్యత కోసం అహర్నిశలు కృషి చేసిన రామారావు మహారాజ్ సేవలు చిరస్మరణీయమని మంత్రి కొనియాడారు. ధర్మపరిరక్షణ, బంజారాల శ్రేయస్సు కోసం విశేష సేవలందించారన్నారు. తన బోధనలతో సన్మార్గంలో నడవాలని సూచించారు. ఇందులో సారంగపూర్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, పార్టీ నాయకులు రాంచందర్, మహారాష్ట్ర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

‘వశిష్ట’లో వార్షికోత్సవం..

జిల్లాకేంద్రంలోని ఆదర్శనగర్‌లో గల వశిష్ట ఇంపల్స్‌స్కూల్‌లో నిర్వహించిన వార్షికోత్సవంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పాల్గొన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్య సాధన కోసం ఉత్తమంగా చదవాలని సూచించారు. ఇందులో డీఈవో రవీందర్‌రెడ్డి, జబర్దస్త్ నటుడు రాకెట్ రాఘవ, ట్రస్మా అధ్యక్షుడు శేఖర్‌రావు, కరస్పాండెంట్ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహారాజ్‌కు ఘననివాళి



నివాళులర్పిస్తున్న సభ్యులు

భైంసాటౌన్: పట్టణంలోని ఆరె మరాఠా సంఘం ఆధ్వర్యంలో శనివారం ఛత్రపతి సంభాజీ మహారాజ్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు సుదర్శన్ పటేల్, డివిజన్ అధ్యక్షులు రఘువీర్ పటేల్, జాదవ్ పుండ్లిక్‌రావు పటేల్ ఉన్నారు.

వీడ్కోలు సమావేశం



నృత్యం చేస్తున్న విద్యార్థులు

ముధోల్: మండల కేంద్రంలోని రబీంద్ర ఉన్నత పాఠశాలలో శనివారం రాత్రి పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు చేసిన విన్యాసాలు, నాటికలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఇందులో పెక్టర్ కాలేజ్ ప్రిన్సిపాల్ గజానన్, యువతరం డిఫెన్స్ అకాడమి చైర్మన్ నరేష్, పాఠశాల ప్రిన్సిపాల్ అసంవార్ సాయినాథ్, కరస్పాండెంట్ రాజేందర్, డైరెక్టర్ పోతన్నయాదవ్, చైర్మన్ భీంరావు దేశాయ్ ఉన్నారు.

ఫ్రూట్స్, వెజిటేబుల్స్ డే



సంబరాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని విజయ ఉన్నత పాఠశాలలో ఫ్రూట్స్, వెజిటేబుల్ డేను శనివారం ఘనంగా నిర్వహించారు .అనంతరం పాఠశాల కరెస్పాండెంట్ మంచిర్యాల నాగభూషణం, ప్రిన్సిపల్ సామ మోహన్‌రెడ్డి మాట్లాడారు. విద్యార్థులందరూ ఆరోగ్యంగా ఉండాలంటే కూరగాయలు, పండ్లు ఫలాలు తినాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్రైమరీ ఇన్‌చార్జి సుష్మిత, ఉపాధ్యాయులు ముక్తేశ్వరి, సంగీత పాల్గొన్నారు.

గ్రామాల్లో కంటి వెలుగు



పరీక్షిస్తున్న వైద్యులు

లక్ష్మణచాంద: మండలంలో మునిపెల్లి గ్రామంలో శనివారం కంటి వెలుగు కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇప్పటి వరకు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 560 మందికి కంటి అద్దాల కోసం ఆర్డర్ పెట్టగా ఇందులో 270 మందికి ఇప్పటికే కంటి అద్దాలు అందచేశామన్నారు. ఇందులో వైద్యులు శ్రీకాంత్, లక్ష్మణ్, శ్వేత, సిబ్బంది శివ క్రిష్ణ, యాస్మిన్ పాల్గొన్నారు.

'స్వచ్ఛతోత్సవ్-2023లో పాల్గొనండి'

భైంసాటౌన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా స్వచ్ఛతోత్సవ్-2023 నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఇందులో వివిధ రంగాల్లోని మహిళలు పాల్గొనాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్‌రావు శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 7 నుంచి 30 వరకు స్వచ్ఛతోత్సవ్ ఉంటుందని, ఇందులో భాగంగా స్వయం సహాయక సంఘాల మహిళలు, మహిళా పారిశ్రామిక వేత్తలు, ఎన్జీవోలు, తదితరులు పాల్గొని పట్టణాలను చెత్తరహిత, పారిశుధ్య వ్యర్థాల నిర్వహణలో మార్పునకు కృషి చేయాలని కోరారు. ముగింపు రోజైన మార్చి 29న దివిటిల ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు.

పట్టుకొచ్చి.. చలానా కట్టిచ్చి..!



పెండింగ్ చలాన్లు పరిశీలిస్తున్న పోలీసులు

భైంసాటౌన్: వివిధ సందర్భాల్లో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారుల నుంచి చలాన్ల వసూలుకు పోలీసులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. శనివారం సాయంత్రం భైంసాలోని బస్టాండ్ వద్ద రోడ్డుపై వెళ్తున్న బైక్‌లు, ఆటోలు, కార్లు, తదితర వాహనదారులను ఆపి మరీ పెండింగ్ చలాన్లు చెక్ చేశారు. కొంతమంది వాహనదారులు పోలీసులను తప్పించుకోగా వారిని పట్టుకొచ్చి మరి చలాన్లు వసూలు చేశారు. ఎక్కువ సార్లు ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడినవారు, అలాగే రూ.వెయ్యి కంటే ఎక్కువగా పెండింగ్ చలాన్లు ఉన్న వారితో అక్కడికక్కడే డబ్బులు కట్టించారు.


స్వర్గధామంలో అన్నీ సమస్యలే



పనులు పూర్తికాని మోడల్ శ్మశానవాటిక



చోరీకి గురైన బోరుమోటార్



పెచ్చులూడుతున్న దృశ్యం



అసంపూర్తిగా భవనం



పూర్తికాని సెప్టిక్‌ట్యాంక్

నిర్మల్ జిల్లా కేంద్రంలోని శివాజీ చౌక్‌లో హిందూ శ్మశాన వాటికను మోడల్‌గా అభివృద్ధి చేసేందుకు నాలుగేళ్ల క్రితం రూ.20లక్షలతో పనులు ప్రారంభించారు. అప్పటినుండి ఇప్పటి వరకు పనులు కొనసాగుతూనే ఉన్నాయి. అప్పటి కలెక్టర్ ముషారఫ్ అలీ ఫారూఖీ ఆధ్వర్యంలో రూ.20 లక్షల పనులను కాస్తా రూ.2కోట్లకు పెంచారు. నిధులు ఖర్చు అయినప్పటికీ పనులు మాత్రం పూర్తి కాలేదు. దీంతో మళ్లీ రూ.3కోట్లకు ప్రతిపాదనలు పంపించగా నిధులు మంజూరయ్యాయి. అయితే ఇంకా పనులు ప్రారంభం కాలేదు. అయితే శ్మశానవాటికలో కోట్లు ఖర్చు చేసినా పనులు మాత్రం నామమాత్రంగానే కనిపిస్తున్నాయి. ఇందులో నీటికోసం రెండు బోర్లను ఏర్పాటు చేశారు. అయితే ఆ బోరును కూడా దొంగలు ఎత్తుకెళ్లారు. ఇప్పటి వరకు శ్మశాన వాటికకు వచ్చేవారికి నిల్వ నీడ లేక, స్నానాలు చేసేందుకు నీటి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకుని త్వరగా సమస్యలు తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

12న ఉద్యమకారుల ఆత్మగౌరవ సదస్సు

ఖానాపూర్: ఈ నెల 12వ తేదీన హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించ తలపెట్టిన తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సదస్సును జయప్రదం చేయాలని టీయూఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు రహీం అన్నారు. శనివారం స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే ఉద్యమకారుల సంక్షేమబోర్డును ఏర్పాటు చేసి రూ.10వేల కోట్ల బడ్జెట్‌ను కేటాయించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలలో 20శాతం తెలంగాణ ఉద్యమకారులకు కేటాయించాలన్నారు. నామినేటెడ్ పదవులలో ఉద్యమకారులకు ప్రాధాన్యత కల్పిస్తూనే పెన్షన్, ఉచిత బస్‌పాస్ సౌకర్యం, ఆరోగ్య కార్డులు, 300 గజాల ఇంటిస్థలం, వడ్డీలేని రుణాలు ఇవ్వాలన్నారు. ఉద్యమ కారులను తెలంగాణ స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తించి గౌరవించాలన్నారు.

వీరాంజనేయ ఆలయంలో ధ్వజప్రతిష్ఠామహోత్సవం

లోకేశ్వరం: మండలంలోని గడ్‌చాంద గ్రామంలో వీరాంజనేయ మందిరం ధ్వజ ప్రతిష్టాపన మహోత్సవ వేడుకలు శనివారం ప్రారంభమయ్యాయి. శనివారం శాంతిపాఠం, గోపూజ, గణాంబిక పూజ, రక్షాబంధనం, అంఖడ దీపారాధానం, అంకురారోపణం నిర్వహించారు. భక్తులు ఉదయన్నే వీరాంజనేయ ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు.

ఆర్థికసాయం అందజేత



వివరాలు తెలుసుకుంటున్న కృష్ణంరాజు

ఖానాపూర్: మండలంలోని బీర్నంది పంచాయతీ పరిధిలోని రంగపేట గ్రామానికి చెందిన పొలాస రవి అనే యువకుడు బ్రెయిన్ న్యూరో సమస్యతో బాధపడుతుండగా బాధితుడికి మంత్రి ఐకేరెడ్డి వ్యక్తిగత సహాయకుడు కృష్ణంరాజు రూ.5వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. బాధితుడికి హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో వైద్యులతో మాట్లాడి ప్రత్యేక బెడ్ ఏర్పాటు చేయించడంతో పాటు దగ్గరుండి సర్జరీని పర్యవేక్షించారు. రోగికి మెరుగైన వైద్యం అందేలా చూడాలని ఆస్పత్రి అధికారులను కోరారు. ఆయన వెంట అసిస్టెంట్ ప్రొఫెసర్ ఖానాపూర్‌కు వాసి డాక్టర్ కట్కం రాము, కుటుంబీకులు ఉన్నారు.

దాతల కోసం ఎదురుచూపు...

బాధితుడు రవి తల్లి లలిత సైతం క్యాన్సర్‌తో 15 రోజుల క్రితం మృతిచెందింది. పొలాస రవి భార్య చేతన మానసిక పరిస్థితి బాగలేకపోవడంతో పాటు ఇద్దరు 10 ఏళ్లలోపు వయస్సు గల కూతుర్లు ఉన్నారు. ఇప్పటికే తల్లి కోసం చేసిన అప్పులతో పాటు ఇప్పుడు వైద్యం కోసం సైతం అప్పులు చేయాల్సి వస్తుందని, ఎవరైనా దాతలు ఆదుకోవాలని బాధితుడి సోదరుడు పొలాస సంతోశ్ కోరారు. దయార్థులు వివరాలకు 90321 53663లో సంప్రదించవచ్చని తెలిపాడు.

బీసీలంతా ఏకం కావాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బీసీ సంఘం నాయకులు

ఖానాపూర్: జనాభాలో సగభాగం కంటే ఎక్కువగా ఉన్న బీసీలంతా ఏకమైతేనే హక్కులను సాధించుకోవచ్చని బీసీ కులాల ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ ఎస్. గంగాధర్ అన్నారు. శనివారం పట్టణంలోని విశ్రాంతిభవనం ఆవరణలో బీసీ కులాల కరపత్రాన్ని విడుదల చేశారు. కులవృత్తులపై ఆధారపడే వారిలో అత్యధిక మంది బీసీలే ఉన్నారన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా చేతివృత్తులన్నీ చతికిలపడి ఆదరణ కోల్పోవడంతో అంతరించిపోయే దశలో ఉన్నాయన్నారు. వెనుకబడిన కులాలను ముందుకు తీసుకెళ్లడంలో పాలకుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందన్నారు. జనాభా ప్రకారం రిజర్వేషన్లు కల్పించకపోవడంతో బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. చట్టసభల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. రాష్ట్రంలో బీసీ బంధు అమలుచేసి ప్రతీ కుటుంబానికి రూ.10లక్షలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు కోడూరు చంద్రయ్య, మామిడి వినయ్, ఎస్. నరేష్, పి. రాంచందర్, పి. నరేష్ ఉన్నారు.

ప్రశంసాపత్రాలు అందజేత



ప్రశంసాపత్రం అందుకుంటున్న లక్ష్మీనారాయణ

ఖానాపూర్: సంఘ విద్రోహుల సమాచార సేకరణలో భాగంగా సీసీటీఎన్ఎస్, టీఎస్ కాప్స్ అప్లికేషన్‌లలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మండలానికి చెందిన పలువురు అధికారులు, సిబ్బందికి ఎస్పీ ప్రవీణ్‌కుమార్ కమాండేషన్ సర్టిఫికెట్‌లను అందజేశారు. శనివారం జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో ఇదివరకు ఖానాపూర్ సీఐగా పనిచేసిన అజయ్‌బాబుతో పాటు ప్రస్తుతం ఇక్కడే పనిచేస్తున్న సిబ్బంది లక్ష్మీనారాయణ, రాజేశ్వర్, ఊషన్న తదితరులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ డీఎస్పీ జీవన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభకు పురస్కారాలు అందజేత



సవితకు ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న ఎస్పీ

కుంటాల: కుంటాల పోలీస్‌స్టేషన్‌లో ఉత్తమ సేవలందించినందుకు ఎస్సై సాయికిరణ్, రిసెప్షనిస్ట్ డి.సవితకు శనివారం నిర్మల్‌లో జరిగిన సమావేశంలో ప్రశంసాపత్రాలను ఎస్పీ ప్రవీణ్‌కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సైతో పాటు సవితను పలువురు అభినందించారు. మునుందు ఇలాంటి పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భైంసా ఏఎస్పీ కాంతి లాల్‌పాటిల్ సుభాష్, డీఎస్పీ జీవన్‌రెడ్డి ఉన్నారు.

క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన ఎస్పీ



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న ఎస్పీ ప్రవీణ్ కుమార్

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో అప్పల రాకేష్ (పోలీస్ కానిస్టేబుల్) జ్ఞాపకార్థం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం ఎస్పీ ప్రవీణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రాకేష్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మొదటి మ్యాచ్‌ను టాస్ వేసి ప్రారంభించారు. ఇందులో భైంసా ఏఎస్పీ కాంతిలాల్, నిర్మల్ డీఎస్పీ జీవన్‌రెడ్డి ఉన్నారు.

ఆటో యూనియన్ మండల కార్యవర్గం ఏర్పాటు

మామడ: ఆటో యూనియన్ మండల నూతన కార్యవర్గాన్ని శనివారం మండల కేంద్రంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా అమిరోద్దిన్, ఉపాధ్యక్షుడిగా సయ్యద్ రహీం, కోశాధికారిగా హైమద్, ప్రధాన కార్యదర్శిగా హరిని ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఆటో యూనియన్ నాయకులను శాలువతో సన్మానించారు. యూనియన్ సభ్యుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

అభ్యసన ఉపకరణాలు వినియోగించాలి

మామడ: బోధనలో అభ్యసన ఉపకరణాలు వినియోగించాలని మండల విద్యాధికారి ముత్యం, ఎఫ్ఎల్ఎన్ నోడల్ అధికారి వెంకటరమణరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని తాంద్ర, వాస్తాపూర్, రాంపూర్ ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. ఎఫ్ఎల్ఎన్ అమలు, విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. విద్యార్థుల హాజరును పెంచాలని సూచించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మెనూ పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

కుభీర్: మండల కేంద్రమైన కుభీర్‌లోని కస్తూరిబా ఉన్నత పాఠశాలను ఎంఈవో చంద్రకాంత్ పరిశీలించారు. అనంతరం ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. విద్యార్థులు చదువుతున్న తీరుని తెలుసుకుని కొని ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ప్రిన్సిపల్ సువర్ణ, ఉపాధ్యాయురాలు హిమబిందు ఉన్నారు.

పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ

తానూరు: మండలంలోని బోరిగాం జిల్లా పరిషత్ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు బీజేపీ వార్డు అధ్యక్షులు గణేశ్ శనివారం పరీక్ష ప్యాడ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వార్షిక పరీక్షకు సిద్ధమై వందశాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు విశ్వనాథ్ ఆప్పా, ఉపాధ్యాయులు ఉన్నారు.

బీడీ వర్కర్స్ రాష్ట్ర మహాసభలు

నిర్మల్‌చైన్‌గేట్: ఈ నెల 13, 14వ తేదీలను నిజామాబాద్‌లో జరిగే తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ 9వ రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలని ఆ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎం.హరిత అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని గొల్లపేటలో రాష్ట్ర మహాసభలకు సంబంధించి కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రం బీడీ పరిశ్రమను మూసివేసే చర్యలకు దిగుతోందని, 26 రోజుల పని దినాలు కనీస పెన్షన్ 3000 లాంటి సమస్యలపై కార్యాచరణ రూపొందించి ఈ సభల్లో చర్చిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎస్ వెంకటేష్, కార్మికులు పాల్గొన్నారు.

కిచెన్ గార్డెన్‌పై అవగాహన

కుంటాల: మండలంలోని పెంచికల్‌పాడ్ పాఠశాల ఆవరణలో పండిస్తున్న కూరగాయాలు ఎంతో లాభసాటిగా ఉన్నాయని ప్రధానోపాధ్యాయులు ఎల్లన్న పేర్కొన్నారు. ప్రతి ఇంటిలో పోషకాలు ఉండే కూరగాయాలను పండించుకునేందుకు కిచెన్ గార్డెన్ను ఏర్పాటు చేయాలని కోరుతూ శనివారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. జీవనశైలిలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకుంటే నిత్యం కూరగాయలు ఇంటి వద్దనే లభ్యమవుతున్నాయని వివరించారు.

విద్యార్థులు వార్షిక పరీక్షలకు సిద్ధం కావాలి

తానూరు: విద్యార్థులు 10వ తరగతి వార్షిక పరీక్షల కోసం సిద్ధం కావాలని ఎంఈవో సుభాష్ అన్నారు. శనివారం మండలంలోని ఎల్వి జిల్లా పరిషత్ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులు, పోషకులకు నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 10వ తరగతి వార్షిక పరీక్షల సమయం దగ్గర పడుతోందని విద్యార్థులు పరీక్షలకు ప్రణాళిక పరంగా సిద్ధం కావాలని సూచించారు. ఇంటి వద్ద విద్యార్థులకు పనులు చెప్పకుండా చదివించాలని పోషకులకు సూచించారు. విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు భూమన్న యాదవ్, ఉపాధ్యాయులు ధర్మజీ చందనే, మాదవ్‌రావ్, రమేశ్, సుదర్శన్, సుజాతదేవి, గంగారాణి ఉన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. గ్యాస్ సిలిండర్ అందజేయండి..



లోకేశ్వరం: సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టింది. వంట చేసేందుకు సబ్సిడీపై గ్యాస్‌ను అందిస్తామని ప్రకటించింది. కానీ పథకం ప్రారంభించినప్పటి నుంచి నేటి వరకు సబ్సిడీ సిలిండర్లను అందించకపోవడంతో కట్టెల పొయ్యి పైనే భోజనం తయారు చేయాల్సి వస్తోంది. దీంతో అటు విద్యార్థులు, ఇటు వంట ఏజెన్సీ మహిళలకు ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు స్పందించి గ్యాస్ సిలిండర్‌ను అందజేయాలని మధ్యాహ్న భోజన నిర్వాహకులు కోరుతున్నారు.

- సంబంధిత అధికారి: చంద్రకాంత్, మండల విద్యాధికారి లోకేశ్వరం, 9502936560

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



విద్యార్థుల ప్రదర్శనలు, నృత్యాలు

ఖానాపూర్: పట్టణంలోని శాంతినగర్ కాలనీలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాల వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. స్థానిక జేకే ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో విద్యార్థుల నృత్యాలు ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ విశ్వేశ్వర్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల వార్షికోత్సవం



సాంస్కృతిక ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

నిర్మల్‌రూరల్: మండలంలోని డ్యాంగాపూర్ గ్రామంలోని ప్రభుత్వ బాలుర ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం రాత్రి వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రధానోపాధ్యాయుడు అంబారావు పాఠశాల నివేదిక వివరించారు. విద్యార్థులు ప్రదర్శించిన పిరమిడ్, నృత్యాలు, నాటికలు అలరించాయి. ఇందులో డీటీడీవో అంబాజీ, ప్రకాష్, సర్పంచ్ సరిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మరో కొనుగోలు కేంద్రం ఏర్పాటు



కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తున్న అధికారులు

తానూరు: మండల కేంద్రంలోని వ్యవసాయ గోదాంలో గత నెల 25వ తేదీన శనగ కొనుగోలు కేంద్రాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. వ్యవసాయ గోదాంలో మూడు కొనుగోలు కేంద్రాలు మాత్రమే ఉన్నాయి. అధిక సంఖ్యలో రైతులు పంటలు తీసుకురావడంతో పంట అమ్ముకునేందుకు ఇక్కట్లకు గురయ్యారు. రెండు రోజులు గోదాముల వద్ద రైతులు బారులుతీరారు. దీంతో ఈ నెల 8వ తేదీన సాక్షి దినపత్రికలో ×పంట అమ్ముకునేందుకు పాట్లు¤ శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. దీంతో శనివారం మార్క్‌ఫెడ్ అధికారులు మరో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు చేస్తామని పీఏసీఎస్ సీవో భూమన్న తెలిపారు.

ఇసుక తరలించేందుకు అనుమతి పొందాలి

లోకేశ్వరం: మండలంలోని పుస్పూర్, హత్గాం, సాథ్గాం, బిలోలి, హవర్గ, మన్మద్ పోట్‌పల్లి గ్రామాల సమీపంలోని సుద్దవాగు నుంచి ఇసుక తరలించే ట్రాక్టర్ యాజమనులు అనుమతులను పొందాలని తహసీల్దార్ సరిత ఒక ప్రకటనలో తెలిపారు. సుద్దవాగు నుంచి ఇసుక తరలించే యాజమానులు తహసీల్దార్ కార్యాలయంలో ట్రాక్టర్‌కు రూ.880 రశీదును పొంది ఇసుకను ప్రభుత్వ పనులకు సంబంధించిన పనులకు తరలించాలన్నారు. లేని పక్షంలో కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ పేర్కొన్నారు.

స్వామిజీ విగ్రహ ప్రతిష్టాపన

లోకేశ్వరం: మండలంలోని కన్కపూర్ గ్రామ సమీపంలోని బ్రహ్మేశ్వర ఆయలం వద్ద సత్యనంద సరస్వతీ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ వేడుకలు శనివారం ప్రారంభమయ్యాయి. శనివారం గణపతిపూజ, రక్షబంధనం, అఖండ దీపారాధన నిర్వహించారు.